# తాకట్టు అప్పారావు

జీవన్

ఆలోచిస్తున్నాడు అప్పారావు. గుడి పక్క మురిక్కాలవ లోంచి బయట పడి, ఎండి పోయి రంగుమారిన కొప్పరి పీచులాంటి జుత్తులోకి వేళ్ల జొనిపి ఆలోచిస్తున్నాడు. 'సిన్మా హీరో'లా సైకిల్ మీద రయ్యిన పోతూ ఎస్సైగార్ని అధాట్న సగం కాలిన బీడీ ముక్కని అందుకుని దమ్ములాగుతూ ఆలోచించాడు.

తుప్పు పట్టిన రేకు డబ్బాలో మిగిలిపోయిన నీటిని చుక్క చుక్కగా చప్పరిస్తూ ఆలోచించాడు.

కడుపు నిండా బియ్యపు బస్తాలు కూరుకొని గర్భిణీ స్త్రీలా భారంగా నడుస్తున్న లారీ అప్పుడే ప్రసవించిన నల్లటి పొగలను ముద్దాడుతూ ఆలోచించాడు.

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేగారి కొత్తకారు విధాన సౌధం వేపు దూసుకు పోతూ రేపిన దుమ్మని గుండెల నిండా పీల్చుకుని ఉక్కిరి బిక్కిరిగా ఆలోచించాడు.

తోకూపుతూ పక్కన చేరిన గజ్జికుక్కపిల్ల వీపు నిమురుతూ సావధానంగా ఆలోచించాడు.

అప్పారావు ఆలోచిస్తూనే వున్నాడు. జీవితంలో ఆ ఒకే ఒక్క కోరిక కూడా తీరకుండానే పోతానా అని భయంతో ఆలోచిస్తున్నాడు.......

నిజానికి అప్పారావుకు పెద్ద కోర్కెలేమీ లేవు. మంచి మంచి బట్టలు కావాలని కోరుకోవటం లేదు. మేడలు కావాలని మిద్దెలు కావాలని కోరుకోవడం లేదు. గుడిసె కావాలనైనా కోరుకోడం లేదతను. ఇరానీ హోటల్లో చికెన్ బిర్యానీ తినాలన్న కోరిక కూడా కాదతనిది.

ఎంత చెట్టుకు అంత గాలి అని ఎంత మనిషికి అంతే కోర్కెలు వుండాల 'నుకునే అప్పారావు కనీస కోర్కె ...... చలికాలం కప్పుకోవడానికో దుప్పటి. రాబోయే చలికాలాన్ని తలుచుకుంటేనే వెన్నులోంచి ఒణుకు పుట్టుకొస్తున్నది.

కోఠీ సెంటర్లో రోడ్డు పక్కన 'యాపారం' చేసే గడ్డం సాయిబుల దగ్గర చేశాడు కూడా! కొసరి కొసరి వంద రూపాయిల ఛద్దర్ని అరవై రూపాయలకు దించాడు.

అవును, అరవయ్యే కావల్సింది అప్పారావుకు ..... అంతకంటే ఒక్క పైసా కూడా ఎక్కువ అక్కర్లేదు ......

చలికాలం ప్రవేశించింది......

ఉలెన్ కోట్లూ, స్వెట్టర్లూ, మఫ్లర్లని పలకరిస్తూ చలికాలం నగర ప్రవేశం చేసింది.

ఉన్ని రగ్గుల్లో దూరి కౌగిలింతల వెచ్చదనాన్ని అనుభవించే పడుచు జంటలకు కిత కితలు పెడుతూ ప్రవేశించింది. పొగలుకక్కే ఇరానీ ఛాయ్‌లతో వేడెక్కిన చర్చలలో తలదూరుస్తూ ప్రవేశించింది. వాల్‌పోస్టర్ల, పాతటైర్ల నెగళ్ళ చుట్టూ చేరిన అనాథ బాలల కబుర్లతో తానై ప్రవేశించింది.

ముసలి వాళ్ళకు దగ్గునే ఆయాసాన్ని ప్రసాదిస్తూ ప్రవేశించింది.

అప్పారావులో అలజడి మొదలైంది.

అప్పారావులో ఆందోళన మొదలైంది.

చెప్పాపెట్టకుండా వచ్చిన అతిథిలా చలికాలం వచ్చేసింది.

ఇహ ఆలస్యం చెయ్యడానికి వీల్లేదు తాకట్టు పెట్టడానికేమైనా మిగిలాయా అని చుట్టూ చూశాడు అప్పారావు.

గాలీ వెల్తుర్లనీ, ఎండావానల్నీ, సమస్త రుతువుల్నీ సాదరంగా ఆహ్వానించే తన 'మేడ' పై కప్పు కేసి చూశాడు.

రకరకాల జండాలూ, బ్యానరు గుడ్డలూ కలగలిపి అల్లిన కప్పు అది. ఎన్నికలొచ్చి ఎంతో మేలు చేశాయి. అప్పారావుకి .... తల దాచుకునేందుకు గూడు ఏర్పాటు చేశాయి.

అప్పారావు అన్ని పార్టీలనూ సమానంగా ప్రేమిస్తాడు. ఏ పార్టీ మీదా ప్రత్యేకమైన ప్రేమ, ద్వేషమంటూ లేదతనికి. అందుకే అన్ని పార్టీల జండాలూ, బ్యానరు గుడ్డల్ని అపురూపంగా సేకరించి ఓ యింటి వాడయ్యాడు. ఈ జండాల్నీ, బ్యానర్లనీ తాకట్టు పెడితే ....... గొప్ప ఆలోచనే వచ్చింది అప్పారావుకి.

కానీ, ఎన్నికలై పోయాయి. అయినా ఆ గుడ్డ ముక్కల్ని ఎవడు తాకట్టు పెట్టుకుంటాడు?

అధాట్న ఏదో వాసనని పసిగట్టిన కుక్కపిల్ల బస్తా పుస్తకాల బరువుతో ఇంటికెళ్ళే స్కూలు పిల్లాడు కొరుక్కు తింటున్న బన్నుముక్కని ఒక్క ఉదుట్న అందుకుంది. రొట్టె ముక్క తిని ఈగలతో సయ్యాటలాడుతున్న కుక్కపిల్లని చూడగానే మరో ఆలోచనొచ్చింది అప్పారావుకి.

పోనీ, ఈ కుక్కపిల్లనో!

పూట పూటా పూటుగా మాంసం మెక్కి, ఏనిగలా వుండే డీఎస్పీ గారి అల్సేషియన్ కూడా కాదే!

ఛ! గజ్జి కుక్క

ఎవ్వడూ తాకట్టు పెట్టుకోడు ............

'ఏం జేస్తున్నావ్ రా!' అంటూ టకటక కఱ్ర చప్పుడుతో ప్రవేశించి సొట్లు పడ్డ చిల్లుల సత్తుగిన్నెని కింద పడేసి కూలబడింది రత్నమ్మ. అప్పారావుకు లభించిన అపురూప రత్నం ఈ రత్తమ్మ.

రత్తమ్మని చూడగానే గమ్మత్తయిన ఆలోచన తట్టింది ....... పోనీ . ఈ రత్తమ్మని తాకట్టు పెడితే!

అప్పారావు సత్య హరిశ్చంద్రుడే కావచ్చు ......... రత్తమ్మ మాత్రం చంద్రమతి కాదు: కనీసం సావిత్రిలా కూడా లేదు.

'ధూ! గుడ్డిముండ అంటారు' అనుకున్నాడు అప్పారావు.

'అందెలెప్పుడు చేయిస్తవు అప్పారావూ! తడుముకుంటూ అప్పారావుని పట్టుకుని ప్రేమగా ప్రశ్నించింది రత్తమ్మ.



వాళ్ళ అమ్మమ్మ పోతూ పోతూ యిచ్చిన వెండి కడియాల్ని అయిదేళ్ళ నాటి కర్ఫ్యూ కాలంలో తాకట్టు పెట్టాడు అప్పారావు ..... అందెలు చేయిస్తానని ప్రమాణం చేసి. అప్పటి నుండి రోజూ గుర్తు చేస్తోంది.

'నల్లపూసల తాడును ఎట్లాగూ సాగనంపితివి.....' సాగదీసింది. గుడి కోసం మసీదుని కూల్చిన కష్టకాలంలో అక్కర కొచ్చిందది. 'స! ఊకేయే ... సలికాలం మొస్తుంటేవిసుక్కున్నాడు అప్పారావు. 'రాకుంట పోద్దా? సలికాలంమొస్తది, ఎండాకాలం మొస్తది, ఆనకాలమొస్తది'— — రుతువుల మార్పంటే ఏమిటో గుడ్డి దానిక్కూడా తెలుసు.

అది కాదే! ఎచ్చగా కప్పుకుం టానికో 'సెద్దరు' అన్నాడు.

మురిసిపోయింది రత్తమ్మ.

చద్దర్లో దూరి వెచ్చగా భర్త పక్కన ........ కలలు కనడం కూడా తెలీని పుట్టు గుడ్డి కలలు కంటోంది.

ఏం చేయాలో పాలుపోవడం లేదు అప్పారావుకి.

ఎదురుగా జీబు ఆగేసరికి గుండె ఆగినంత పనైంది... పోలీసోడేమో!

జీబులోంచి దిగిన వాళ్లది ఖాకీ రంగు కాకపోవడంతో ఊపిరి పీల్చు కున్నాడు.

'తాకట్టు అప్పారావంటే నువ్వేనా? రంగు కళ్లజోడూ, చేతిలో ఫైలూ వున్నాయన అడిగాడు.

తనని వెతుక్కుంటూ వచ్చిన అధికారి వేపు ఆశ్చర్యంగా చూశాడు అప్పారావు. నిజానికి అప్పారావు యింటి పేరు కాదది. గొప్ప గొప్పోళ్ళకి ప్రభుత్వం పద్మశ్రీ బిరుదులిచ్చినట్లే, మురికివాడ జనం ఆయనకు ప్రసాదించిన బిరుదు.

ఏనిగల అప్పారావెవరంటే ఎవు డాడు అని అడుగుతారు. తాకట్టు అప్పారావంటే ఈ వోల్ ఏరియా అంతట్నీ తెలుసుద్ది .... అంటూ గర్వంగా చెప్పు కుంటాడతను.

మా తాతలు ఏనిగల మీద వూరేగిన్రు అని గత వైభవం గుర్తు చేసుకుని వుప్పొంగి పోతాడు.

వాళ్ళ తాతలు ఏనిగలు మీద వూరేగార్లో, మరి వేటి మీద వూరేగారోగానీ తన చిన్నతనంలో ఐదెకరాల పొలం

# నేను

నేను ఏడిస్తే -
దరిద్రపు ముఖందాన్ని !
నేను నవ్వితే -
బరితెగించిన దాన్ని !
నీ కర్మకాలి నువ్వు చస్తే -
నేను ముదనష్టపుదాన్ని -
అర్ధాంగిని,
జీవిత భాగస్వామిని,
ఆకాశంలో సగాన్ని !
పదాల "అర్థవిపరిణామా"న్ని గమనించి
సహించే మూగస్వరాన్ని!

- కోట్ల వెంకటేశ్వరరెడ్డి

వుండేది వాళ్ల నాన్నకు. 'మా తాత మూరెకరాల రైతు. మా నాయన టయి మొచ్చేటాల్కి పాతికెకరాలు. నా కాడికొచ్చే టాల్కి చూసినవుగా' అంటూ చిల్లి కుండలోంచి నీరు పోయినట్టుగా భూము లెలా చేజారి పోయాయో తండ్రి వివరించే వాడు. 'నువ్వు భూమిని నమ్ముకో వద్దురా. వుజ్జోగం చేసుకో సుకంగ బతొకొచ్చు' అంటూ వుండేవాడు. తను అయిదో తరగతిలోకి రాకుండానే ఆ అయిదెకరాలూ హరించుకుపోయాయి. పట్నం వలస వచ్చాడు అప్పారావు.

అలా తండ్రి తాతల నించి సంక్రమించిన గుణం తాకట్టు. 'దొంగోడి చేత పడ్డ సొమ్మెట్లనో తాకట్టు పడ్డా అంతే' అనే పాఠం నేర్చుకున్నాడు.

'ఏంది ఎటో చూస్తూవ్ నిన్నే అడిగేది!' ఆఫీసరు వెనకాల చేతులు కట్టుకు నించున్న బంట్రోతు అడిగేసరికి లోకంలోకి వచ్చాడు. 'మళ్లీ ఓట్లొచ్చినయా? అని ఎదురు ప్రశ్నించాడు.

తన ప్రశ్నకు సమాధానం కూడా చెప్పకుండా తననే ఎదురు ప్రశ్నించే అలగా వాణ్ణి చూసి గద్దించాడు ఆఫీసరు .... 'నీ పేరేంటి?

'ఈనేనయ్యా తాకట్టు అప్పారవంటే' రత్తమ్మంది.

'నువ్వెవరు?'

'అది మా యాడదండి... రత్తమ్మ!' పెద్ద ఆఫీసరెవరో ఏమవుద్దోననుకుంటూ సమాధానం చెప్పాడు అప్పారావు.

'పిల్లలు?' కాయితం మీద రాసుకుంటున్న గుమాస్తా అడిగాడు.

'లేరయ్యా' అంటున్న రత్తమ్మని గదమాయించి 'ఎందుకండీ!' అనడిగాడు అప్పారావు.

'కారట్లిస్తర్రా అప్పారావ్, రేసన్ కారటు' అదే జీబులో వచ్చిన ఓట్లతో గెలిచిన నాయకుడన్నాడు.

'కారటు' పేరు వినేసరికి అప్పారావు కళ్ళు మిలా మిలా మెరిసాయి. ఓటున్నా, 'కార్డు' లేనిదే సంపూర్ణమైన పౌరుడు కాడనేది అతని లాంటి వాళ్ళ నిశ్చితా భిప్రాయం.

'ముగ్గురండి!' అన్నాడు అప్పారావు తక్కున

'ఆమేమో లేరంటుంది?' ఆఫీసరు ప్రశ్నించాడు.

'లేరంటే నండి ... ఇంటి కాడ లేరనండి. ఇస్కూలుకు పోయున్రు. నేనే యిడిపి పెట్టొచ్చిన'

వాళ్ళ పేర్లూ, వయసూ అడిగారు. గడగడా తన యిష్టమైన దేవుళ్లని, దేవతలవీ పేర్లు చెప్పాడు అప్పారావు. కార్డు లిప్పించుకుని ఆ దేవుళ్ళని మనసులో ప్రార్థించుకున్నాడు కూడా!

'శాస్త్రీ!' ఇంటి కొలతలు చూడు' గుమాస్తాకు ఉపందిస్తూ అన్నాడు అధికారి.

తన 'ఇంటి' కొలతలు తీసుకుంటున్న అధికారుల వేపు ఆశగా చూస్తున్నాడు అప్పారావు.

'ఇంటికి ఎన్ని గదులు/ దూలాలు, వాసాలూ' ప్రశ్నించాడు అధికారి.

ఇంటి కప్పుకేసి చూస్తూ తెల్లబోయి నిల్చున్నాడు శాస్త్రి.

'అన్యాయంరా యిది అప్పారావు! నా ఎలక్షన్ బ్యానర్ని ఇల్లు కట్టి పడేస్తావా?' లీడరుగారు నొచ్చుకున్నారు.

' మీకే వోట్లేసినం గదయ్యా యింటిల్ల పాదిమీ. మీ సేవలి మరువలేము సారూ!' చేతులు జోడించాడు అప్పారావు.

'నోట్ చేశావా?' ప్రశ్నించాడు అధికారి గుమాస్తాని.

'సార్! దీన్ని ఏ కేటగిరీలో చేర్చ మంటారు? డాబా కాదు, పెంకిటిల్లూ కాదు! సందేహంగా అడిగాడు గుమాస్తా.

'గుడిసె ...... హట్'

'ఇది గుడిసె కూడా కాదు సార్!'

అయితే బండెక్కు. కార్డు యిష్యూ చెయ్యలేం.

'సారూ! నా కారటు? దీనంగా ప్రశ్నించాడు అప్పారావు.

'కుదరదయ్యా! గుడిసె కూడా లేని వాడికి కార్డెట్లా యిస్తాం' విసుక్కున్నాడు అధికారి.

'కారెట్లిప్పిస్తనంటె్న గదయ్య మీకోట్లేసినం. తవురైనా చెప్పుఁ్రి' లీడర్‌గారిని దీనంగా యాచించాడు అప్పారావు.

'వీడు నా ఓటరండీ! కార్డివ్వా ల్సిందే' దృఢంగా చెప్పాడు లీడరు.

'ఎట్లాగండీ' శాస్త్రి.

లీడరుతో తంటా ఎందుకనుకొని 'కానీవయ్యా శాస్త్రీ! గుడిసె అని రాసెయ్ 'అన్నాడు అధికారి.

'అప్పారావు నీ యింటికి పట్టా వుందా? ఆఫీసరు అడిగాడు మళ్లీ.

'ఓట్లయినంక యిప్పిస్తనన్నడు అన్న' ఆకాశం వైపు చేతులెత్తి అన్నాడు అప్పారావు.

'అసెంబ్లీల బిల్లు తెస్తం' లీడరు భరోసా యిచ్చాడు.

శాస్త్రి గగ్గోలు పెడుతూ .....'సార్! ఇది పబ్లిక్ ప్రాపర్టీనండీ, పేవ్‌మెంట్ సార్! పట్టా ఎట్లా యిస్తారు? అన్నాడు.

'అయితే కార్డు లేదు పద' జీబు వైపు మరలాడు అధికారి.

'సారూ! సారూ!' వెంట పడ్డాడు అప్పారావు.

'నా ఓటరుకు అన్యాయం జరిగితే సహించను' హెచ్చరించాడు లీడరు.

'ఎట్లాగండి! పేవ్‌మెంటు మీదుండే వాడికి కార్డెట్లా యిస్తాం!'

ఓటెట్ల యిచ్చిఁ్రను' లాజిక్కు లాగాడు అప్పారావు.

'బిల్లు తెస్తం .... ఎమ్మెల్యే ననుకున్నావా? మజాకానా!' చిందులు తొక్కాడు.

'ఇదెక్కడి తంటాలండీ బాబు! అవతల నాపై అధికారి ... నా మొగుడు ... ఒప్పుకోడండీ!'

'నీ మొగుడికి నేచెబ్తలే' లీడరుగారు భరోసా యిచ్చారు.

కిసుక్కున నవ్వింది రత్తమ్మ. మొట్టికాయ వేశాడు అప్పారావు.

'సరే ... అంతా మీదే బాధ్యత. రాసెయ్యవయ్యా శాస్త్రీ!' ఆఫీసరు గుమాస్తాని ఆజ్ఞాపించాడు.

కార్డు తీసి వివరాలు రాసి 'ఫోటో వుందా? అనడిగాడు శాస్త్రి అప్పారావుని.

తెల్లమొహం వేశాడు అప్పారావు ... 'నేనంత గొప్పోణ్ణి కాదయ్యా!'

'గొప్పో కొద్దో నా కెందుకు? కార్డు మీద ఫోటో వుండాలి అంతే!'

వాళ్ళ వెంట వెంటే తిరిగుతున్న ఫోటో గ్రాఫర్ 'నే తీస్తానయ్యా అప్పారావ్! గంటలో ఫోటో యిస్తాను' అన్నాడు.

'తీయించుకో' శాస్త్రి సలహా యిచ్చాడు.

'ఎంత?'

'పదిహేను'

'అంత నేనిచ్చుకోనేను.'

'ఎంతిచ్చుకుంటావ్?'

'అసలు నా కాడ పైసల్లేవ్!'

'మరి ఫోటో ఎట్లనయ్యా'శాస్త్రి.

ఆలోచించాడు అప్పారావు మరోసారి.

'అప్పు పెడ్తవ?'

## వాకహామ్స్

అధికార దాహానికి
అహంకార మదమెక్కితే
మనషులంతా మట్టిబొమ్మలే
ఆర్తనాదాలన్నీ జయ ధ్వానాలే!

అలలు అలలుగా గతం నీడలు
నీలి కళ్లలో కదులుతుంటే
రాయి విసిరినట్టే వుంటుంది
నిశ్చలమైన చెరువుగుండెలో!

ఉలికొసకి తాపిన కల
శిల్పమై పలకరించింది
శిల్పి చెమట ఆవిరై
భావుకుని వూపిరయ్యింది.

అడిగితే యివ్వనందుకే
చెట్టు మీదికి విసిరింది రాయి
ఇచ్చినా కుళ్లు పండు యిస్తే
గొడ్డలికి పని తప్పదోయి!

—— *ఏటూరి నాగేంద్రరావ్*

## కవులకు మనవి

తెలుగులో ఉత్తమ కవిత్వాన్ని ప్రోత్సహించాలనే సదుద్దేశంతో శ్రీ కొల్లు రంగారావు సంపాదకత్వంలో ఒక కవితాసంకలనాన్ని ప్రచురించబోతున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

రాష్ట్రంలోని ఆసక్తి కలిగిన కవులందరూ 15నుంచి 25 పంక్తుల లోపు కవితలను 31-12-95 లోపు గా హామీ పత్రం, సంక్షిప్త పరిచయం, స్వంత చిరునామా గల కవరును జతచేసి పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఎంపికైన కవితల కవులకు 6-4-96 లోపు కవితా సంకలనం ప్రతి తోపాటు ప్రశంసా పత్రం అందజేయ బడుతుంది.

అనిల్ ప్రింటర్స్
సిరిసిల్లా రోడ్, కామారెడ్డి.

'ఎప్పుడిస్తవ్?'

'కారెటెప్పుడొస్తె గప్పుడు'

'పదేను యియ్యాలె... పంద్రా'

'పది .. దస్!' బేరమాడాడు.

'కానీవయ్యా! శాస్త్రి తొందర చేశాడు.

'సరే నిలబడు!అని చేతిలో పలకపెట్టి, పలకమీద రాసి, గుండెలకు అదిమి పట్టుకొమ్మని .. ఫోటో తీశాడు.

జేబు వెల్లిపోయింది.......

రెండ్రోజులు తరువాత కార్డు తీసుకుని ఈలవేసుకుంటూ బయల్దేరాడు ... డీలర్ దగ్గరకు. వెంట పడ్డాడు ఫోటోగ్రాఫర్.

'సేట్ సాబ్! ఇగో కారటు. ఎంతిస్తవ్ డిమాండ్ చేస్తున్నట్టు అడిగాడు అప్పారావు.

'ఏమ్‌రోయ్! బంగారమయినట్టో, వెండయినట్లో అడుగుతున్నావ్ ... కనీసం పట్టా కాయితం కూడా కాదాయె!'

'పచ్చ కారటు సేటూ! బియ్యమిస్తరు, గోధుమలిస్తరు, పంచదారిస్తరు; సిరలిస్తరు, దోతులిస్తరు' కార్డంటే కల్పవృక్షమన్నట్టుగా చెప్పుకుపోతున్నాడు అప్పారావు.

' పైసలెన్ని గయన్నొస్తయా? ప్రశ్నించాడు సేటు.

'అందుకేగా నీ కాడికొచ్చింది. ఎంతిస్తవో చెప్పు!'

'ఎంతకిస్తవో చెప్పు!'

తనకు డెబ్బై యిస్తవా?అంతే అడుగు దామకుంటే సేటు గిసి గిసి బేరమాడతాడు.

'వంద .. సౌ రూపయే!'

'ఇరువై ... బీస్!'

'ఎనుబై యిస్తవా?'

సేటు మౌనం వహించాడు. తనని కాదన్నట్టుగా ఎటో చూస్తున్నాడు.

'నీ కాడ కుదర్దలే! కార్డు తీసుకుడు బింకంగా.

'అప్పారావ్, జల్దీ పంపిచ్చు నన్ను. అవ్‌తల నాకు పన్లేదనుకున్నావా ఏంది.... నీ సుట్టు తిరుగుకుంట వుండెటందుకు' తొందరపెట్టాడు ఫోటోగ్రాఫర్.

'ఇంత కంటె ఎక్కువెవ్వరన్నిస్తె కారటు తీస్కపో!' అంటూ ఇరవై రూపాయలు చేతిలో పెట్టాడు సేటు. బయటకు రాగానే ఫోటోగ్రాఫరుకు పది రూపాయలిచ్చాడు.

'కారటు రాసిన గుమాస్తా కియ్యొద్దా?' ఫోటోగ్రాఫర్ గుర్తు చేశాడు.

'ఎంత?'

ఆ పదీ లాక్కుని ... 'సరిపెట్టుకుంటడులే!' అంటూ నిష్క్రమించాడు ఫోటోగ్రాఫర్.

* * * *

చలికాలం వెళ్ళిపోయింది............

అప్పారావు కోర్కె తీర్చకుండానే!

చలికాలం వెళ్ళిపోయింది ...........

అప్పారావు లేకుండానే!

---

23 పేజీ తరువాయి.

రాజు ఇంకా రాలేదు. ఆమె హృదయం అనుభూతించడం.... మెదడు ఆలోచించడం మానేసినాయి. ఆమెలో కంగారు ఎక్కువ అయింది.

దూరంగా ఒక వెలుగు చుక్క కన్పించింది. అది క్రమంగా పెద్దదయి ...... పెరిగింది "గౌతమి" గా గుర్తించింది దాన్ని ట్రైను మెల్లగా వచ్చి స్టేషన్‌లో ఆగింది.

శ్యామలకి ఏం చెయ్యాలో పాలుపోలేదు. ట్రైన్ ఆగీ...ఆగడంతోనే కట్టతెంచుకున్న జన ప్రవాహం ముందుకు దూకింది. రెండే నిమిషాలు ఆగుతుందేమో సీట్లకోసం ఎక్కటం కోసం....'జనయుద్ధం' మొదలు అయింది.

శ్యామల నిర్నిమేషంగా ట్రైన్ వంక చూడసాగింది. ఆమెకు ఎందుకో ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. తనకూ...ఆట్రైనుకూ....ఏదో పోలిక వున్నట్టు. తను ట్రైను లాంటిదా? అలా అయితే....'ఏస్టేషన్ని తన సొంతం అనుకోలేదు. అలా నిరంతరం ప్రయాణిస్తూ వుండాల్సిందే. ఒక అనుభవం నుండి మరొక అనుభవానికి... పోనీ స్టేషన్ లాంటిదా? అలా అయితే.... ఏ ట్రైనూ తనలో శాశ్వతంగా ఆగదు. ఏ అనుభవమూ జీవితం చివరి వరకూ మిగలదు.

ట్రైను వెళ్లిపోయింది. నిశ్శబ్దం మెల్లగా స్టేషన్ని తన కౌగిట్లోకి తీసుకుంది. మళ్లీ తెల్లవారు జామున చార్మినార్ వచ్చిందాకా ప్లాట్ ఫారాలకి విశ్రాంతే.....ఆ నిశ్శబ్దం మరో కొత్త రూపును సంతరించుకో సాగింది.

అప్పుడెప్పుడో తన పుట్టిన రోజుకి "రాజు" ' ఇచ్చిన గ్రీటింగ్ కార్డులోని కొటేషన్ ఒకటి ఆమెకు గుర్తుకొచ్చింది.

"When Darkness slowly creeps in
And the streets stands deserted
When the town is fast asleep
And Loneliness stirs awake
You can hear me sigh"

ఉప్పెనలా ముంచుకొచ్చిన దుఃఖం ఆమెను విచలితురాల్ని చేయగా ఆ రెండో నంబరు ప్లాట్‌ఫారం మీద శ్యామల అలా నిలబడి పోయింది.

